సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 3 | సెప్టెంబర్ | 2024



సైబర్ నేర జంట అరెస్ట్

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని నకిలీ వెబ్‌సైట్లతో ఆకర్షించి మోసం చేస్తున్న సైబర్‌నేర జంటను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో▸



డేంజర్.. డేంజర్ - 8లో▸

జిల్లాలో రైల్వే ట్రాక్‌ల పక్కనే నీరు రోజుల తరబడి నిలిచి ప్రమాదకరంగా తయారైంది. అధికారులు దృష్టి సారించడం లేదు.

గరిష్టం/కనిష్టం
29^0 /22^0

వాతావరణం

జిల్లాలో ఉదయం అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్ధనారీశ్వరుడిగా రుద్రేశ్వరుడు



హన్మకొండ కల్చరల్ : నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రుద్రేశ్వరస్వామిని అర్ధనారీశ్వరుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు గణపతి ఆరాధన, రుద్రేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు.

జాగ్రత్తలు పాటించండి



ఎంజీఎం : భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లోని ప్రజలు ఆహారం, తాగునీరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.లలితాదేవి సూచించారు. సోమవారం నగరంలోని ఏషియన్ శ్రీదేవి మాల్ సమీపంలో గల సాయిబాబా గుడి వద్ద గుడిసెలు, భట్టుపల్లిలోని ఏజీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించి ప్రజలకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ముంపు బాధితులు ఏమైనా సమస్యలుంటే వెంటనే స్థానిక ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

కేఎంసీకి పార్థివదేహం అప్పగింత

ఎంజీఎం : సహృదయ ఆశ్రమంలో ఉంటున్న లింగయ్య(75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. తెలంగాణ నేత్ర అవయవ దాతల అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు యాకూబ్, చోటుబాయ్‌లు లింగయ్య పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు (కేఎంసీ) అప్పగించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఒక్క పార్థివదేహంతో 100 మంది విద్యార్థులు వైద్య విద్యను నేర్చుకుంటారని, శాస్త్ర పరిశోధనకు తోడ్పడుతుందన్నారు. బాధ్యులు ఉపేందర్ రెడ్డి, రాజమౌళి, శంకర్‌రావు,రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్' దరఖాస్తు గడువు పొడిగింపు

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ఆదర్శ (మోడల్) పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు (ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. హెచ్‌టీటీపీ//బీఎస్‌ఈ.తెలంగాణ.గౌట్.ఇన్‌లో వెబ్ సైట్‌లో సంప్రదించాలన్నారు.

6న మినీ జాబ్‌మేళా

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 6వ తేదీన(శుక్రవారం) ములుగు రోడ్డు సమీపంలోని ఐటీఐ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి సోమ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెచ్‌డీఎఫ్‌సీ, యస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరాం లైఫ్ ఇన్స్యూ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు. అర్హత, ఆసక్తి గల యువతీ, యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 11గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాల కోసం హెచ్‌డీఎఫ్‌సీ, ముత్తూట్(70931 68464), శ్రీరాం లైఫ్(98010 27897) సంప్రదించాలన్నారు.

ఆర్టీసీకి రూ.95 లక్షల ఆదాయం నష్టం

హన్మకొండ : భారీ వర్షాలకు వరంగల్ రీజియన్‌లో టీజీఎస్ ఆర్టీసీ రూ.95 లక్షల ఆదాయాన్ని కోల్పోయింది. వాగులు, వంకలు పొంగడంతో అనేక ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో రవాణా వ్యవస్థ చిన్నాభిన్నమై, ఆర్టీసీ బస్సులు నడవలేని పరిస్థితి నెలకొంది. ఆదివారం 208 బస్సులు డిపోలకే పరిమితం కాగా రూ.80 లక్షల ఆదాయం కోల్పోయింది. సోమవారం కూడా 30 బస్సులు నిలిచిపోయాయి. మరికొన్ని బస్సులు పూర్తి రూట్‌లో కాకుండా మధ్య వరకు మాత్రమే నడిపించారు. దీంతో రూ.15 లక్షల ఆదాయం నష్టం వచ్చింది. ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను సంప్రదించి పూర్తి సమాచారం తెలుసుకొని ఇంటి నుంచి బయలు దేరాలని ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను సూచించారు. సమాచారం కోసం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ ఫోన్ నంబర్ 99592 26056, వరంగల్ జిల్లా బస్ స్టేషన్ నంబర్ 99592 26057లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వరదొస్తే కట్టుబట్టలతో..

లోతట్టు కాలనీవాసుల కన్నీటి మొర

- రెండు రోజులుగా నీటిలోనే నగర పరిధిలోని పలు కాలనీలు
- చెరువుల మత్తళ్లతో తగ్గని వరద ఉధృతి
- పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న ప్రజలు
- నీళ్లు నిలిచి ఉండడంతో దోమల వృద్ధి



వరంగల్ అర్బన్/కాశిబుగ్గ/వరంగల్/ఖిలావరంగల్ : పోటెత్తిన వరద..వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు తీరని వేదన మిగిల్చింది. పైన ఉన్న చెరువుల మత్తళ్లు జోరుగా పోస్తుండడంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి, చుట్టూరా వరద నీరు భారీగానే చేరుతోంది. ముంపు బాధితులు రెండు రోజులనుంచి పునరావాస కేంద్రాల్లో మగ్గుతున్నారు. సోమవారం పొద్దంతా కాసేపు విరమణ, మరికాసేపు ముసురుతో సరిపెట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో 'మేం ఏం పాపం చేశాం..దేవుడా' అంటూ ముంపు ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెస్తం చెరువు, ఉర్సు రంగసముద్రం, భట్టుపల్లి, బంధం చెరువుల మత్తళ్లు పరవళ్లు తొక్కుతుండడంతో గొలుసుకట్టు నాలాలు కనుమరుగై నీరంతా బొంది వాగు ద్వారా తీవ్రరూపం దాల్చుతూ సమీపంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది. దీంతో వరంగల్ భద్రకాళి చెరువుకు సమీపంలోని హంటర్ రోడ్డు 28వ డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్, సంతోషిమాతా కాలనీ వరద నీళ్లల్లో ఉన్నాయి. దీంతో సమీపంలోని గుజరాత్ మార్వాడి కమ్యూనిటీ హాల్‌లో తల దాచుకుంటున్నారు. అదేవిధంగా 32వ డివిజన్ లోని ఎస్‌ఎన్ నగర్, డీకే నగర్‌లు వరద నీటిలో చిక్కుకుపోయి ఉర్సు ప్రభుత్వ పాఠశాలలో ఉంటున్నారు. భట్టుపల్లి చెరువు, బంధం చెరువు నుంచి వచ్చే వరద ఉధృతి 49వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ ఎటుచూసిన వరద నీరే కనిపిస్తోంది. ఈ కాలనీ వాసులను ఈజీఆర్ గార్డెన్‌లో, 18వ డివిజన్ లోని గాంధీనగర్‌లోని 40 కుటుంబాలకు ప్రతాప్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉంటున్నారు. బల్దియా ఆధ్వర్యంలో సుమారు 400 మందికి భోజనం, నీరు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు.

పొంచి ఉన్న అంటువ్యాధులు

వరంగల్ నగరం ఇప్పటికే జ్వర పీడితులతో కిక్కిరిసి పోతోంది. ప్రస్తుత వర్షాలు, వరద నీరు నిలిచి ఉండటంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. ఇళ్ల మధ్య వరద నీరు నిలిచి ఉండటం వల్ల దోమల ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నాయి. డెంగీ, మలేరియా, విష జ్వరాలు సోకే ప్రమాదముంది. వెంటనే అర్బన్ మలేరియా విభాగం రంగంలోకి దిగి దోమలు వ్యాప్తి చెందకుండా లోతట్టు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఈ బాధలు.. ఇంకెన్నాళ్లు

'ఇంట్లోకి వరద చేరి సామన్లు అన్ని కొట్టుకుపోయాయి. ఎన్నాళ్లీ మాకు ఈ బాధలు' అంటూ నగరంలోని మైసయ్యనగర్ ముంపు బాధితురాలు అన్నబోయిన స్వప్న ఆవేదన వ్యక్తం చేస్తోంది. భారీ వర్షాలతో జలమయమైన 35వ డివిజన్ మైసయ్యనగర్ సోమవారం కూడా ముంపులోనే ఉంది. కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఒక్కసారిగా వచ్చిన వరదతో ఇళ్లలోని సామన్లు ఎక్కడికక్కడే వదిలేసి ప్రాణాలతో బయటపడ్డామని వాపోయారు. నిత్యావసర, ఎలక్ట్రిక్ వస్తువులు, బియ్యం, పప్పు, దుస్తులు అన్ని పాడైపోయాయని, కొన్ని కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండ్రోజులుగా నీళ్లు నిలిచి ఉండటంతో పాములు వస్తున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరద నీటిలో ఎన్‌టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీలు



జలదిగ్బంధంలోనే శివనగర్



లోతట్టు ప్రాంతాలైన శివనగర్, పాడి మల్లారెడ్డి, మైసయ్యనగర్, కాశికుంటలో వరద వీడడం లేదు. శివనగర్‌లోని సీసీ రోడ్లు వాగులను తలపించేలా మూడు ఫీట్ల ఎత్తుతో వరద నీరు ప్రవహిస్తోంది. మధ్యకోట పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది.రాతికోట జల్లి తూము నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. పంటపొలాలు, ఆకుకూర తోటలు నీట మునిగాయి. 34, 37, 40 డివిజన్లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న ప్రజలను స్థానిక కార్పొరేటర్లు పరామర్శించి, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఆక్రమణతో కుచించుకుపోయిన నాలా



నాలా నిడివి తక్కువ ఉండడంతోనే..

మార్కెట్ ప్రధాన రహదారిపై ఉన్న నాలా నిడివి తక్కువగా ఉండడంతో పై నుంచి పెద్దఎత్తున వచ్చే వరద చెరువులోకి పోక పోవడంతో పై ప్రాంతంలో సాయిగణేష్‌కాలనీ, ఎస్‌ఆర్‌నగర్, గాంధీనగర్ ముంపునకు గురవుతున్నాయని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా ఎస్‌ఆర్‌నగర్‌లోని కల్వర్టు పైపులు అన్ని మూసుకుపోవడంతో వరద నీరు వెళ్లక పోవడంతో తరచూ ముంపునకు గురవుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న నాలాలను గుర్తించి అక్రమణలను తొలగిస్తే వరద ముంపు నుంచి పరిష్కారం అయ్యే అవకాశాలున్నాయని పలువురు వాపోతున్నారు.



హనుమకొండ బస్టాండ్ దారిలో ధ్వంసమైన రోడ్డు

వరద బాధితులతో మాట్లాడుతున్న కమిషనర్



పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందండి

- మరో రెండు రోజులు భారీ వర్షాలు
- సౌకర్యాలు కల్పిస్తాం : బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ముంపు ప్రాంత బాధితులు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్లో సోమవారం కమిషనర్, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఎస్‌ఎస్ నగర్, బీఎస్ నగర్, డీకే నగర్, తెలంగాణ కాలనీ, మైసయ్యనగర్ ప్రాంతాలను సందర్శించారు. ఉర్సు ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రంలో ఉంటున్న బాధితుల ఇబ్బందులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు బల్దియా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలని ఆమె ధైర్యం చెప్పారు. అదేవిధంగా వరంగల్ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సందర్శించారు. ప్రజలకు అందజేస్తున్న వైద్యసేవలను ఆయన పరిశీలించి మందులను పంపిణీ చేశారు.

నగరంలో వరద నష్టం రూ.18కోట్లు

- దెబ్బతిన్న రోడ్లు, పైపులైన్లు
- ప్రభుత్వానికి అధికారుల నివేదిక

రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలతో గ్రేటర్ వరంగల్ పరిధిలో రూ.18కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. హనుమకొండలోని రెడ్డి పురం, ఆర్‌టీసీ బస్ స్టేషన్ రోడ్డు, హౌసింగ్ బోర్డు రోడ్డు, వరంగల్‌లోని ములుగు రోడ్డు, ఉర్సు రంగసముద్రం రోడ్డు, ఎల్‌బీనగర్‌లోని డ్రెయినేజీ, ఇలా బీటీ, సీసీ, మట్టి రోడ్లు, కల్వర్టులు, మురుగు కాల్వలు, తాగునీటి పైపులైన్లు, స్లూయిస్ వాల్వ్‌లు, దెబ్బతిన్నాయని అధికారులు తేల్చారు. హనుమకొండ ప్రాంతంలో రూ. 10కోట్లు, వరంగల్ ప్రాంతంలో రూ.8కోట్ల వరకు నష్ట నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం సాయంత్రం అధికారులు పంపించారు.

కట్టుబట్టలతో బయటపడుతున్నాం



ఏడాదంతా కష్టపడి సంపాదించుకున్న సరుకులు, దుస్తులు, ఇతర వస్తువులు ప్రతీఏడాది వర్షాకాలంలో వరద నీటిలో కొట్టుకుపోతున్నాయి. కట్టుబట్టలతో బయటపడుతున్నాం. రోజుల కొద్ది పునరావాస కేంద్రంలో ఉంటున్నాం. మా కాలనీలోకి వరద నీరు చేరకుండా చూడండి.

- వి.స్వప్న, ఎన్‌టీఆర్ నగర్

మా గోస ఎవరికి పట్టేది?



రెక్కాడితే గానీ డొక్కాడని కష్టజీవులం. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకుని బతుకుతున్నాం. వర్షం వస్తే ఇంటి చుట్టూ, ఖాళీ స్థలాల్లో నీరు చేరుతోంది. చూస్తుండగానే ఇళ్లలోకి వరద నీరు వస్తుంది. ఇన్నేళ్లు అయినా వరద రాకుండా పనులు చేపట్టలేరా?, అధికారులు మమ్మల్ని కొంచెం కనికరించండి.

- సాంబయ్య, ఎన్‌టీఆర్ నగర్

రెండేళ్ల నుంచే ముంపు



వివేకానందకాలనీలో 35ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. రెండేళ్లుగా మా ఇంట్లోకి నీరు వస్తోంది. పైన ప్రాంతాల్లో ఉన్న కాల్వలు మొత్తం ఆక్రమించుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని మా కాలనీ వాసులు అంటున్నారు.

-పి.రాజయ్య, రిటైర్డ్ ఉద్యోగి, వివేకానందకాలనీ

నాలుగు రోజుల్లో పనులు పూర్తిచేయండి

సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి



కాళోజీ కళాక్షేత్రాన్ని పరిశీలిస్తున్న సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి

నయీంనగర్/వరంగల్ అర్బన్/ఎంజీఎం/హన్మకొండ అర్బన్ : కాళోజీ కళాక్షేత్రంలోని అదనపు పనులను నాలుగు రోజుల్లో పూర్తిచేయాలని, ఈనెల 9న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, కుడా వీసీ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం నయీంనగర్ హై లెవల్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. అదేవిధంగా గ్రేటర్ ప్రధాన కార్యాలయం ఆవరణలో పరిపాలన భవన నిర్మాణ ప్రతిపాదిత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంజీఎం సందర్శన..

వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిని సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి సోమవారం కలెక్టర్ సత్యశారదతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఔట్, ఇన్ పేషెంట్ తదితర విభాగాలను పరిశీలించి, రోగులకు భోజనం అందించే వంట గదిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందజేస్తున్న వైద్యం, శస్త్రచికిత్సలను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీని అడిగారు. నైట్‌డ్యూటీ మహిళ వైద్యులకు రక్షణ కల్పించిన గదులను పరిశీలించి, మహిళ సెక్యూరిటీ గార్డులతో పాటు ప్రత్యేక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆస్పత్రి ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న నర్సింగ్ స్కూల్ భవనాన్ని అజిత్‌రెడ్డి పరిశీలించారు. నర్సింగ్ విద్యార్థులకు రామ్‌కీ అపార్టుమెంట్‌లో వసతి కల్పించినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓలు మురళీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 9న సీఎం జిల్లా పర్యటన నేపథ్యంలో.. జిల్లాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలపై హనుమకొండ కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కుడా' ఆధ్వర్యంలో చేపడుతున్న కాళోజీ కళాక్షేత్రం, ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియ, వరంగల్ బస్టాండ్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ, స్మార్ట్ సిటీ, ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పనుల విషయం ఏమైనా సమస్యలుంటే.. ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే రెండు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.

వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు నష్టం

- హనుమకొండ సర్కిల్‌లో రూ.1.80 లక్షలు
- వరంగల్ సర్కిల్‌లో 1.20 కోట్లు

హన్మకొండ: బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు టీజీ ఎన్పీడీసీఎల్‌కు వరంగల్, హనుమకొండ జిల్లాలో నష్టం వాటిల్లింది. చెట్లు విరిగిపడడంతో పాటు, సబ్ స్టేషన్లు మునిగి, పిడుగు పడి, వరదకు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిని విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్‌లో రూ.1.80 లక్షలు, వరంగల్ సర్కిల్‌లో రూ.1.20 కోట్లు నష్టం జరిగింది. హనుమకొండ సర్కిల్‌లో చెట్లు విరిగిపడడంతో 18 స్తంభాలు, ఒక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, 23 ఇన్సులేటర్లు దెబ్బతిన్నట్లు, వరంగల్ సర్కిల్‌లో 193 స్తంభాలు, 95 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. హనుమకొండ సర్కిల్ నోడల్ ఆఫీసర్, సీజీఎం టి.మధుసూదన్, ఎస్‌ఈ కె.వెంకటరమణ, వరంగల్ సర్కిల్ నోడల్ ఆఫీసర్, సీజీఎం కె.కిషన్, ఎస్‌ఈ పి.మధుసూదన్ రావు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అంతరాయాలు కలిగిన ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. డీఈ, ఏడీ, ఏఈ, సిబ్బంది సమన్వయంతో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఎస్‌ఈలు తెలిపారు.

ఎప్పటికప్పుడు మానిటరింగ్..

వాతావరణ శాఖ సూచనలు పాటిస్తూ విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తున్నామని వివరించారు. అంతరాయం, ఇతర సమస్యలుంటే.. హనుమకొండ సర్కిల్ వినియోగదారులు 94910 75110 నంబర్‌లో, టోల్ ఫ్రీ నంబర్ 1912, 180042 50028కు నంబర్లకు వరంగల్ సర్కిల్ వినియోగదారులు 79016 28362, టోల్ ఫ్రీ నంబర్ 1912, 18004250028 ఫోన్‌నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్సార్

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- డీసీసీ భవన్‌లో వైఎస్సార్‌కు ఘన నివాళి



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులు

హన్మకొండ చౌరస్తా : సంక్షేమ పథకాల ప్రదాత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. దివంగత మహానేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడారు. అన్నదాతల ఆత్మబంధువు వైఎస్సార్ అని కొనియాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ముఖ్యమంత్రిగా మొదటి సంతకం ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ చేశాడని గుర్తు చేశారు.పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు పావల వడ్డీ రుణాలు ఇచ్చాడని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు, మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దే అని కొనియాడారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, బంక సరళ, నల్ల సత్యనారాయణ, జాఫర్, సమ్మయ్య, యాదగిరిగౌడ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.


దోర్నకల్ : ముల్కలపల్లి సమీపంలో పొలాల్లో ఇసుక మేటలు


మహబూబాబాద్: మున్నేరు సమీపంలో నేలవాలిన వరి పంట


ఖానాపురం: పాకాల పరిధిలో వరి పంటలో ఇసుక మేటలు


కురవి శివారులో మిరప తోటలో ఇసుక మేటలు


తాడ్వాయి- పస్రా మధ్య ధ్వంసమైన రోడ్డు

అల్లకల్లోలం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఈ వర్షం ధాటికి గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. శిథిలావస్థలోని ఇళ్లు కూలుతున్నాయి. కాలనీలు జల ప్రవాహంలో చిక్కుకుంటున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ తెగుతున్నాయి. ఫలితంగా జనజీవనం స్తంభిస్తోంది. పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్


తాడ్వాయిలో కౌలు రైతు బంగారు నర్సమ్మ పొలంలో ఇసుక మేటలు


నర్సింహులపేట: కౌసల్యదేవిపల్లి ఆకేరు బ్రిడ్జి వద్ద వరద ఉధృతికి సగానికి పైగా కోతకు గురైన రోడ్డు


నర్సింహులపేట మండలం రామన్న గూడెంలో ఇసుక మేటగా మారిన పొలాలు


మరిపెడ మండలం పురుషోత్తమాయ గూడెం సమీపంలో ధ్వంసమైన 365 జాతీయ రహదారిని పెకిలిస్తున్న జేసీబీ


చిన్నగూడూరు: వరద ఉధృతికి ఆలయాల చుట్టూ తేలిన రాళ్లు


కాటారం: ఇబ్రహీంపల్లిలో కూలిన ఇల్లు


నెల్లికుదురు: వరదతో రావిరాల గ్రామంలో నేలమట్టమైన ఇల్లు


దోర్నకల్: ముల్కలపల్లి వద్ద ఆకేరు వరదలో కొట్టుకుపోయి తేలిన జేసీబీలు, ట్రాక్టర్లు

కాజీపేట దర్గా చారిత్రాత్మకం

● అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

కాజీపేట రూరల్ : కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా హిందు, ముస్లింల ప్రతీక, చారిత్రాత్మకంగా విరాజిల్లుతోందని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి దర్గా ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాగా ఖుస్రూపాషా ముస్లిం సంప్రదాయ ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఖుస్రూపాషా స్పీకర్, ఎంపీ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు, సత్యనారాయణ, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ డీసీసీ ప్రెసిడెంట్ ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ వెంకట్‌లను కలిసి దర్గాను దర్శించుకొని దర్గాపై చాధర్ సమర్పించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు దర్గాను దర్శించుకున్నానని, ఎన్నికల సమయంలో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఖుస్రూపాషా ప్రార్థించారని తెలిపారు. అదేవిధంగా హన్మకొండ నయీంనగర్ నాలా అభివృద్ధిలో ఎమ్మెల్యే నాయిని చేసిన అభివృద్ధిని చూసి హైదరాబాద్‌లో హైడ్రా విధానంను ప్రవేశపెట్టామని అన్నారు. దర్శించుకున్న వారిలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజా వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, కాంగ్రెస్ నాయకుడు ఈవీవీ శ్రీనివాస్, పీఠాధిపతి భక్తియార్ బియాబాని, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఖుస్రూపాషా

దర్గాను మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ కాజీపేట దర్గాను సోమవారం దర్శించుకున్నారు. వినయ్‌భాస్కర్‌కు స్వాగతం పలికి పీఠాధిపతి ఖుస్రూపాషా దర్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

రైళ్ల రద్దు కొనసాగింపు..

● కాజీపేట మీదుగా వెళ్లే 14 రైళ్ల రద్దు ● పలు ట్రిన్లు దారి మళ్లింపు

కాజీపేట రూరల్ : మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నె-కేసముద్రం సెక్షన్ ట్రాక్ ఘటనతో సోమవారం రెండో రోజు కూడా దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు రూట్లలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

సోమవారం కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, ఈ నెల 5వ తేదీన డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

పార్శల్లీ రద్దు

ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు భద్రాచలంరోడ్-సిర్పూర్ టౌన్ (17033) ప్యాసింజర్ భద్రాచలం-కాజీపేట మధ్య రద్దు, ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు సిర్పూర్ టౌన్-భద్రాచలంరోడ్(17034) ప్యాసింజర్‌ను కాజీపేట-భద్రాచలం రోడ్ మధ్య రద్దు చేసినట్లు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట జంక్షన్, నాగపూర్, నడికుడ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లను సోమవారం రైల్వే అధికారులు దారి మళ్లించి నడిపించారు.

రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సోమవారం సికింద్రాబాద్-విశాఖపట్నం(22204) ఎక్స్‌ప్రెస్, ఆదిలాబాద్-నాందేడ్ (17409) ఎక్స్‌ప్రెస్, నాందేడ్-ఆదిలాబాద్ (17410) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 3న సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్(17234), సికింద్రాబాద్-విశాఖపట్నం (20834) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20708) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం(20707) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-షాలిమార్(12774) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 4న షాలిమార్-సికింద్రాబాద్ (12773) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

రూ.కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేర జంట

వివరాలు వెల్లడించిన సీపీ

వరంగల్ క్రైం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందిస్తామని మోసానికి పాల్పడుతూ ఆన్‌లైన్‌లో దేశ వ్యాప్తంగా ప్రజలనుంచి కోట్ల రూపాయలను కొల్లగొట్టిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన సైబర్ నేర జంటను వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ విభాగం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరి నుంచి చెక్కు బుక్కులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, పెన్ డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ అంబర్ కిషోర్ ఝూ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తాంబరం పట్టణానికి చెందిన జసిల్, ప్రీతి భార్యాభర్తలు. కొద్ది కాలంగా పెట్టిన పెట్టుబడికి ఎక్కువ డబ్బులు తిరిగి వస్తాయని తప్పుడు ప్రచారంతో గోల్డ్‌మ్యాన్ సచ్, యాం బ్రాండింగ్స్ అనే వెబ్‌సైట్లలో ప్రజలతో భారీ మొత్తంలో డబ్బు పెట్టుబడి పెట్టింటారు. రెండు ప్రైవేట్ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, ఖాతాల్లో జమయిన డబ్బులను విత్ డ్రా చేసి జల్సాలు చేస్తున్నారు. ఇదే రీతిలో హనుమకొండకు చెందిన ఒక వ్యక్తి ఈ సైబర్ నేరగాళ్ల తప్పుడు ప్రచారాన్ని నమ్మి వీరు సూచించిన నకిలీ వెబ్‌సైట్లలో సుమారు రూ.28 లక్షల పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దీంతో వరంగల్ సైబర్ క్రైమ్ విభాగం పోలీసులను ఆశ్రయించడంతో ఏసీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులు టెక్నాలజీ అధారంగా నిందితులను గుర్తించారు. ఆదివారం చెన్నయ్‌లోని సలయూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జసిల్, ప్రీతిలను అరెస్టు చేసి స్థానిక జిల్లాలో కోర్టులో హాజరుపర్చి, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తీసుకువచ్చారు. వీరిని విచారించగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో రెండు సైబర్ నేరాలకు పాల్పడినట్లుగా అంగీకరించడంతోపాటు, దేశ వ్యాప్తంగా సుమారు 150కి పైగా సైబర్ నేరాలకు పాల్పడి పెట్టుబడుల రూపంలో కోట్ల రూపాయలు దండుకున్నట్లు అంగీకరించారు. తెలంగాణలో 15 నేరాల్లో రూ.3కోట్లకుపైగా డబ్బు వసూలు చేసినట్లు అంగీకరించినట్లు సీపీ తెలిపారు. నిందితులు డబ్బులను ఏ ఖాతాలకు మళ్లించారనేదానిపై విచారణ చేపడుతున్నామని, ఈ నేరాల్లో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగానీ సంబంధం ఉన్న నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు. నిందితులు వినియోగించిన బ్యాంక్ ఖాతాల లావాదేవిలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఈ సైబర్ నేరస్తుల జంటను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్స్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు చరణ్‌కుమార్, శివకుమార్, ఏఎస్ఐ సల్మాన్‌పాషా, కానిస్టేబుళ్లు రాజు, ఆంజనేయులు, దినేష్, అనూషలను పోలీస్ కమిషనర్ అభినందించారు. సమావేశంలో అదనపు డీసీపీ రవి, తదితరులు పాల్గొన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

శభాష్ వరంగల్ పోలీస్.!

● 'ఎక్స్' వేదికగా డీజీపీ అభినందన

వరంగల్ క్రైం : భారీ వర్షాలతో రోడ్లు, రైలు మార్గాలు ధ్వంసమై ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో వరంగల్ కమిషనరేట్ పోలీసులు, మహబూబాబాద్ పోలీసులు స్పందించిన తీరు శభాష్ అంటూ డీజీపీ జితేందర్ 'ఎక్స్' వేదికగా అభినందించారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ క్షేత్ర స్థాయిలో ముంపు ప్రాంతాలను పరిశీలించి కిందిస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా రైల్వే స్టేషన్‌లలో చిక్కుకున్న ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరే మార్గాలతో పాటు ఆహార పదార్థాలను అందించారు.వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌తో పాటు మహబూబాబాద్ ఎస్పీ, పోలీసులను డీజీపీ అభినందించారు.

నిర్మానుష్యంగా రైల్వే స్టేషన్లు



కాశిబుగ్గ/కాజీపేట రూరల్ : భారీ వర్షాలు, వరదలు, ఇంటికన్నె, కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ ధ్వంసం కారణంగా వరంగల్ మీదుగా నడిచే అన్ని రైళ్లు సోమవారం కూడా రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులతో రద్దీగా ఉండే కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వే స్టేషన్ నిర్మానుష్యంగా మారాయి. రైళ్ల రద్దుతో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు వరంగల్ రైల్వే అధికారులు నగదును వెనక్కి తిరిగి ఇచ్చారు. యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. పనులు పూర్తయితే ట్రయల్ రన్ నిర్వహించిన అనంతరం రైళ్ల రాకపోకలకు అనుమతి ఇచ్చే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి నీరు

కేసముద్రం: కేసముద్రం- ఇంటికన్నె- తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల పరిధిలో సుమారు 26 చోట్ల రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. అమీనాపురం చెరువు మత్తడి పోస్తోంది. ఆ నీరంతా కేసముద్రం స్టేషన్‌లోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి కల్వర్టు పైవరకు వరదనీరు తాకింది. ఇదే మాదిరి వర్షం ఎక్కువైతే ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ విధంగా ఇంటికన్నె, కేసముద్రం మధ్య, తాళ్లపూసపల్లి, కేసముద్రం మధ్యలోని కల్వర్టుల వద్ద వరద ఉధృతి పెరిగితే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


కేసముద్రం స్టేషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ట్రాక్ కింద నిలిచిన నీరు

గార్ల: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని గండిచెరువు పక్కన ఉన్న రైల్వేట్రాక్ భారీవర్షాలు కురిస్తే వరద ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. 10 ఏళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు అలుగు పోస్తుండడంతో గండిచెరువు పక్కన డబ్బాల మోరీ వద్ద రైల్వేట్రాక్ కింద మట్టి, కంకర కొట్టుకుపోయి రైల్వేపట్టాలు నీళ్లలో తేలాయి. దీంతో రైల్వే యంత్రాంగం ఈ ప్రాంతంలో రైల్వేట్రాక్ కింద రాళ్లతో నిర్మాణం చేపట్టి వరదనీరు వెళ్లేందుకు మోరీలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిస్తే వరదనీరు రైల్వే పట్టాల పైనుంచి వెళ్లే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో గండి చెరువు నిండి 2 నెలల పాటు రైల్వేట్రాక్ కింద 5 ఫీట్ల నీళ్లు నిలిచి ఉంటాయి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.



డేంజర్.. డేంజర్

వరద నీటితో రైల్వే ట్రాక్‌లకు పొంచి ఉన్న ప్రమాదం


అయ్యప్పటెంపుల్ ఏరియాలో రైల్వేట్రాక్ పక్కన నిలిచిన వరద నీరు


జనగామ: 384 నంబర్ కల్వర్టు వద్ద పిచ్చి మొక్కలతో నిండిన బ్రిడ్జి

జనగామలో రైల్వే ట్రాక్ పక్కనే వరద..

● ఒకే చోట రోజుల తరబడి నీటి నిల్వ

జనగామ: జిల్లా పరిధిలోని రైల్వే ట్రాక్‌కు పెద్ద ప్రమాదం లేకున్నా.. చిన్న చిన్న లోపాలపై దక్షిణ మధ్య రైల్వే అధికారులు దృష్టి సారించడం లేదు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతికి మహబూబాబాద్ జిల్లాలో రైల్వే ట్రాక్ కొట్టుకు పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం 'సాక్షి' జిల్లా పరిధి రైల్వేట్రాక్ ప్రస్తుత పరిస్థితులపై విజిట్ చేసింది. చిన్న చిన్న లోపాలు ఉన్నట్లు గుర్తించింది. జనగామ మండలం పెంబర్తి నుంచి చిల్పూరు మండలం చిన్న పెండ్యాల వరకు జిల్లా పరిధిలో 45 కిలోమీటర్ల మేర రైల్వేట్రాక్ విస్తరించి ఉంది. పెంబర్తి నుంచి జనగామ వరకు 5 కిలోమీటర్ల దూరం. జనగామ నుంచి యశ్వంతాపూర్-6, యశ్వంతాపూర్ నుంచి రఘునాథపల్లి-6, రఘునాథపల్లి నుంచి ఇప్పగూడెం-9, ఇప్పగూడెం నుంచి స్టేషన్‌ఘన్‌పూర్-7, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నష్కల్-7, నష్కల్ నుంచి చిన్న పెండ్యాల-5 కిలోమీటర్లు ఉంటుంది. జనగామ పట్టణం బాణాపురం సమీపాన 384 కల్వర్టు రైల్వే అండర్ బ్రిడ్జి కింద పిచ్చి మొక్కల కారణంగా రోజుల తరబడి వరద నీరు నిలిచి ఉంటోంది. భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ నుంచి వచ్చే వరద ముందుకు వెళ్లలేని సమయంలో ప్రమాదం పొంచి ఉంటుంది. అలాగే, బాణాపురం అయ్యప్ప టెంపుల్ ఎదుట కట్టపక్కన అర కిలోమీటరు మేర నిలిచిన వరద నీరు కుంటను తలపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు ఎటూ వెళ్లలేక ట్రాక్ కట్టకు ఆనుకుని నిలిచిపోయి.. అందులోనే ఇంకిపోతోంది. పట్టణంలోని పాత బీటు బజారు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్వహణ అధ్వానంగా మారింది. బ్రిడ్జికి మొత్తం ఆరు అండర్ నాలాలు ఉండగా.. పిచ్చి మొక్కలు, చెత్తతో నిండి నీరు రోజుల తరబడి నిలుస్తోంది. వరద ఉధృతి పెరిగిన సమయంలో ఇబ్బందులు తప్పవని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిల్పూరు, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో రైల్వేట్రాక్‌కు ఎలాంటి ప్రమాదం లేదు. ఇప్పగూడెం వద్ద ఈ నెల 1న మధ్యాహ్నం పట్టాలపైకి వచ్చిన కొద్దిపాటి వరద నీరు సాయంత్రానికి తగ్గు ముఖం పట్టింది. రైల్వేట్రాక్ ఎగువ ప్రాంతంలో ఉండడంతో నష్టం జరిగే అవకాశం లేదు.

చెరువులతో కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ట్రాక్‌కు ప్రమాదం

● అప్రమత్తమైన రైల్వే అధికారులు
● రాత్రి, పగలు పెట్రోలింగ్ ముమ్మరం

కాజీపేట రూరల్: మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లి-ఇంటికన్నె రైల్వే ట్రాక్ ఘటనతో సోమవారం రైల్వే అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రైల్వే ట్రాక్ వద్ద గస్తీ మరింత ముమ్మరం చేసి, సమీప చెరువుల వద్ద ప్రమాదాలపై జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గొలుసుకట్టు చెరువులతో రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆయా చెరువులు నిండాయి. మరో రెండు రోజులు ఇలాగే కురిస్తే గొలుసు కట్టు చెరువులు తెగి రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అప్రమత్తమై ఇసుక, కంకర, మట్టి బస్తాలు, మెటీరియల్, సిబ్బందిని అన్ని విధాలా అప్రమత్తం చేసినట్లు వారు తెలిపారు.

ట్రాక్ గస్తీ ముమ్మరం

వడ్డేపల్లి చెరువు వద్ద రైల్వే ట్రాక్ వద్ద వరద నీటి మట్టాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండి పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేశారు. పెండ్యాల, రాజారం చెరువుతో నష్కల్ రైల్వే రోడ్ అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే నష్కల్ వద్ద రైల్వే గేట్ నంబర్ 53 వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి వద్దకు వరద నీరు చేరి నష్కల్, వంగాలపల్లి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వంగాలపల్లి రైల్వే సర్వీస్ గేట్ నంబర్ 54లో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఘన్‌పూర్ సమీపంలో ఇప్పగూడ వద్ద రైల్ అండర్ బ్రిడ్జి వద్దకు వరద నీరు చేరింది.


నష్కల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్ సమీపానికి చేరిన వరదతో స్తంభించిన రాకపోకలు

గతంలో జరిగిన రైలు ఘటనలు

1954 సెప్టెంబర్ 27న యశ్వంతాపూర్ వాగులో వరద నీటిలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ 4 బోగిలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 300 మంది మృతి చెందారు. ఈ ఘటనపై నాటి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రీ రాజీనామా చేశారు. 1987 జూలై 9న మంచిర్యాల వద్ద దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ వరద నీటిలో 14 కోచ్‌లు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 53 మంది మృతి చెందారు. 2005 అక్టోబర్ 29న నల్లగొండ జిల్లా వలిగొండ వద్ద డెల్టా ప్యాసింజర్ వరదలో కొట్టుకుపోయిన ఘటనలో 114 మంది మృతి చెందారు. 200 మందికి గాయాలయ్యాయి.